

అడుగు దూరంలో నీటి విడుదల
కృష్ణా జలాలు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్లను తాకాయి. నీటిమట్టం 851.90 అడుగులకు చేరగా.. 854 అడుగులకు చేరగానే నీరు విడుదల చేయవచ్చు. 8లో▸



వసతి మూత'బడి'
ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12న పునఃప్రారంభమైనా ఆలూరులోని బీసీ బాలుర వసతి గృహం ఇప్పటి వరకు తెరుచుకోలేదు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,613.14
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:44.198
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:38,007
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:193

న్యూస్‌రీల్

సిల్వర్‌సెట్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు, తదితరులు

కర్నూలు సిటీ: ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన సిల్వర్‌సెట్ ఫలితాలను క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డా.కె వెంకటేశ్వర్లు శనివారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సిల్వర్‌జూబ్లీ డిగ్రీ ప్రవేశాలకు ఎంతో పోటీ ఉంటుందన్నారు. ఈ కాలేజీలో చదివిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. సిల్వర్ సెట్‌లో సీట్లు పొందిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 29న సిల్వర్ సెట్ పరీక్ష నిర్వహించామని, 1,196 మంది విద్యార్థులు హాజరు కాగా 1,085 మంది అర్హత సాధించారన్నారు. బీఏలో ఈపూరి సుస్మిత ఫస్ట్ ర్యాంకు సాధించారని, బి.కామ్‌లో జి.మానస, బీఎస్సీ మ్యాథ్స్‌లో పి.చిరు హాసిని, బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో షేక్ హమ్నా లేహర్ మొదటి ర్యాంకు సాధించారన్నారు. కార్యక్రమంలో సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి, కేవీఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ వెంకట రెడ్డి, సిల్వర్‌సెట్ కన్వీనర్ మహమ్మద్ వాహీద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ నాగరాజు శెట్టి పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): బిందు, తుంపర్ల సేద్యం కోసం రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. 2025–26 సంవత్సరంలో 7వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించాలనేది లక్ష్యమని.. బోరు, బావి ఉన్న రైతులు సూక్ష్మ సేద్య సదుపాయం పొంది ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకునేందుకు సూక్ష్మ సేద్యం చక్కటి అవకాశమన్నారు. గత ఏడాది 5,961 మంది రైతులకు 5,653.09 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం కల్పించినట్లు తెలిపారు. ఐదు ఎకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, ఇతర రైతులకు 90 శాతం రాయితీ ఉంటుందన్నారు. 10 ఎకరాలు పైబడిన రైతులకు 50 శాతం రాయితీతో డ్రిప్ సదుపాయం కల్పిస్తామన్నారు. స్ప్రింక్లర్లు అన్ని కేటగిరీల రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. నాన్ సబ్సిడీ చెల్లించిన రైతులకు త్వరలోనే అనుమతులు ఇస్తామన్నారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

మాటరాని మౌనమిది!

- మూడేళ్లయినా మాటలు రాని చిన్నారులు
- పదాలు పలికేందుకు ఇబ్బందులు
- సెల్‌ఫోన్ వాడకమే కారణమంటున్న వైద్యులు
- చిన్నపిల్లల వైద్యుల వద్దకు తల్లిదండ్రుల క్యూ

ఒకప్పుడు చంటిపిల్లలకు చందమామను చూపి గోరుముద్దలు తినిపించేవారు. ఆ తర్వాత తరం వారు వీధిలోకి వెళ్లి జంతువులు, ఇతర పిల్లలను చూపిస్తూ అన్నం పెట్టేవారు. గత తరం వారు టీవీలో కార్టూన్ బొమ్మలు చూపించి పిల్లలకు భోజనం పెట్టేవారు. కానీ నేటితరం మాత్రం మొబైల్ చేతికిచ్చి భోజనం తినిపిస్తున్నారు. అలవాటైన చిన్నారులు రాత్రింబవళ్లూ మొబైల్ కావాలంటున్నారు. దీంతో వారికి మూడేళ్ల వయస్సు వచ్చినా మాటలు రాని పరిస్థితి నెలకొంటోందని, చిన్న పదాలు కూడా పలకడం లేదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

ఒకప్పుడు ప్రతి ఇంట్లో పిల్లలకు అమ్మానాన్నలతో పాటు తాతయ్య, నానమ్మ, చిన్నాన్న, చిన్నమ్మ, అత్తమ్మలు ఉండేవారు. వీరందరూ పిల్లలను ఆడిస్తూ పెంచేవారు. బయటకు తీసుకెళ్లి ప్రపంచాన్ని చూపించి పిల్లలను ఆనందింపజేసేవారు. ఇప్పుడు ఇంట్లో ఎంత మంది ఉంటే అందరూ బిజీగా మారారు. చిన్నకుటుంబాలు ఎక్కువ కావడంతో పిల్లలను ఆడించేవారు కరువయ్యారు. వారికి సెల్‌ఫోన్‌లో వచ్చే ఆటలే ఆటవస్తువులుగా మారాయి. అందులో వచ్చే కార్టూన్ బొమ్మలను, రంగులను చూసి పిల్లలు ఆకర్షితులు అవుతున్నారు. రెండేళ్ల వయస్సు కూడా రాకముందే పెద్దల కంటే మిన్నగా మొబైల్‌ను ఆపరేట్ చేసేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. వారి ఉత్సాహం, చైతన్యం చూసి ఆ వయస్సులోని చిన్నారులను చూసి ఇంట్లో తల్లిదండ్రులతో పాటు పెద్దలు కూడా ఎంతో సంతోషిస్తున్నారు.



➤ కర్నూలు వెంకటరమణకాలనీకి చెందిన శివరాముడుకి ఒక కుమారుడు ఉన్నాడు. పాలుతాగాలన్నా, ఏదైనా తినాలన్నా మొబైల్ ఇవ్వాల్సిందే. ఇప్పుడు ఆ బాలునికి మూడేళ్ల వయస్సు. ఇప్పటికీ ఆ బాలుడికి మాటలు రావడం లేదు.

➤ కర్నూలుకు చెందిన లలితకుమారికి భర్త ఇటీవలే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారున్ని అల్లారుముద్దుగా పెంచేందుకు ఆమె రెండేళ్ల వయస్సు నుంచే పిల్లాడిని గారాబం ఎక్కువ చేసింది. ఈ క్రమంలో ఆ బాలుడు సెల్‌ఫోన్‌కు ఎక్కువగా బానిసయ్యాడు. అర్ధరాత్రి 2 గంటలైనా సెల్‌ఫోన్ చూస్తూ గడిపేవాడు. ఈ క్రమంలో బాలుడు నాలుగేళ్ల వయస్సు వచ్చినా మాట్లాడటం లేదు.

బాలల సత్వర చికిత్స కేంద్రంలో ఇలా...

కేటగిరి పిల్లలు	2020	2021	2022	2023	2024
దృష్టి లోపం	341	136	234	1,514	350
వినికిడి లోపం	64	17	9	9	32
భాషా నైపుణ్య లోపం	38	12	17	122	549
అభ్యాస లోపం	12	6	11	80	18

మాట ముచ్చట కురువై..
అతి చిన్న వయస్సులోనే సెల్‌ఫోన్‌లోని ఫీచర్లను వాడేయడం, యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాను ఎలా వాడాలో పెద్దలకు చూపించడం వంటివి నేర్వడంతో సంతోషించడం పెద్దల వంతైంది. ఈ క్రమంలోనే వారికి మూడేళ్లు వచ్చినా మాటలు రాకపోవడం చాలా మంది గమనించలేకపోతున్నారు. ఒకప్పుడు ఏడాదిన్నరకే అమ్మా నాన్నతో పాటు అవ్వా తాత, అత్తమ్మ, మామ అనే చిన్న చిన్న పదాలు పలికేవారు. రెండేళ్ల వయస్సుకు పొట్టిపదాలతో మాట్లాడేవారు. మూడేళ్లకు వచ్చీరానీ మాటలతో గలగలా మాట్లాడుతూ అల్లరి చేసేవారు. ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా ఆ ముచ్చటే కరువైంది. పెద్దలతో పాటు పిల్లలు కూడా సెల్‌ఫోన్‌లకు బానిసలు కావడంతో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేశారు.

చికిత్స కోసం ఆసుపత్రులకు
కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని బాలల సత్వర చికిత్స కేంద్రంలో గత ఐదేళ్లలో పుట్టుకతో వచ్చిన లోపాలతో పాటు ఎదుగుదల లోపాలతో వచ్చే చిన్నారులు కూడా ఉన్నారు. వీరిలో అధిక శాతం చిన్నతనంలోనే మొబైల్ వాడకం వల్ల మాటలు రాకపోవడంతో పాటు దృష్టిలోపం, వినికిడిలోపం, నేర్చుకోలేకపోవడం, భాష తెలియకపోవడం వంటి లోపాలతో వస్తున్నారు. ఇక్కడే గాకుండా చిన్నపిల్లల విభాగంలోనూ ఇలాంటి చిన్నారులు చికిత్స కోసం వస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలోనూ ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఇలాంటి చిన్నారులను చూస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

మొబైల్‌కు దూరంగా ఉంచడమే మేలు
పిల్లల భాషా నైపుణ్య అభివృద్ధికి మొబైల్ తెరలే అవరోధంగా నిలుస్తున్నాయి. అల్లరి మాన్పించేందుకు, ఆహారం తినిపించేందుకు అలవాటు పడిన ఈ మొబైల్ ఫోన్ వారిని బానసలుగా మార్చుకుంటోంది. ఈ క్రమంలో చిన్నారుల ఎదుగుదలపై అవి తీవ్రంగా ప్రభావాన్ని చూపిస్తోంది. భవిష్యత్ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంట్లో తల్లిదండ్రులతో పాటు ఇంట్లోని పెద్దలు సైతం వారి ఇంట్లోని చిన్నారులను మొబైల్‌కు దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి. ఈ మేరకు ముందుగా పిల్లల ముందు పెద్దలు సైతం మొబైల్ ఎక్కువగా వాడకుండా ఉండటమే మేలు. పెద్దలు వాడకపోతే పిల్లలు అటువైపు దృష్టి సారించరు. ఈ సమయంలో పిల్లలు ఆడుకునేందుకు బొమ్మలను కొనివ్వడం, ఆటలు ఆడించడం, మైదానాలు, పార్కులకు తీసుకెళ్లి ఆడించడం, బంధువుల ఇళ్లకు తీసుకెళ్లి వారిని పరిచయడం చేయించడం, వారి పిల్లలతో స్నేహం చేయించడం వంటివి చేయాలి. అప్పుడే పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి చెందుతుంది.



పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
చిన్నతనంలో ఎక్కువ సమయం డిజిటల్ తెరలను చూడటంతో వారిలో సమాజంలో ఇతరులను కలిసే తత్వం తగ్గుతుంది. ఇది సామాజిక నైపుణ్యాల అభివృద్ధిని నిరోధిస్తుంది. పిల్లలు ఆటల పట్ల దృష్టి పెట్టే సమయాన్ని తగ్గిస్తాయి. ఎక్కువ సేపు మొబైల్ చూసే పిల్లల్లో ఊబకాయం వస్తుంది. ఇది భవిష్యత్‌లో వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వారు నిద్రించే సమయాన్ని తగ్గిస్తుంది. డిజిటల్ తెరల నుంచి వెలువడే నీలికాంతి ఎండోజెనస్ మెలటోనిన్‌ను అణిచివేస్తుంది.

సంప్రదాయ విద్యా విధానాలే మేలు




విద్య విషయంలో పిల్లలకు సంప్రదాయ విధానాలతోనే బోధించాలి. డిజిటల్ తెరలను సాధ్యమైనంత వరకు తగ్గించాలి. పిల్లలు మొబైల్ ఫోన్‌లను పాఠశాలలకు తీసుకురావడానికి అనుమతించకూడదు. సోషల్ మీడియాలో పోస్టులు చేయడాన్ని ప్రోత్సహించకూడదు. ముఖ్యంగా రెండేళ్లలోపు పిల్లలకు డిజిటల్ తెరలకు దూరంగా ఉంచాలి. ఆహారం తినిపించేందుకు సైతం వీటిని ఉపయోగించకూడదు. వారికి కథలు చెప్పడం, ఆటలు ఆడించడం, పాటలు పాడించడం, నృత్యం చేయించడం, వయస్సుకు తగిన బొమ్మలతో ఆడేలా చేయాలి. వీటి వల్ల వారు డిజిటల్ తెరలకు క్రమంగా దూరం అవుతారు.

– డాక్టర్ జి. సుధాకర్, చిన్నపిల్లల వైద్యనిపుణులు, కర్నూలు



కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో ధ్యానముద్రలో విద్యార్థులు, ఉద్యోగులు



యోగాసనం వేస్తున్న విద్యార్థిని

నిత్య యోగాతో ఆరోగ్యం



యోగా దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(టౌన్): అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ఆరోగ్యంగా ఉండాలని, నిత్య యోగాతోనే అది సాధ్యమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో కర్నూలు జిల్లా నుంచి 12,76,000 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఇక మీదట కూడా యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ నగరపాలక సంస్థ నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, మహిళలు, అధికారులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలతో కలెక్టర్ స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, న్యాయమూర్తులు

జిల్లా కోర్టులో...
కర్నూలు(సెంట్రల్): ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది ఉద్యోగులకు సూచించారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు ప్రాంగణంలో యోగాసానాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత పని భారం ఉన్నా రోజూ అరగంటపాటు యోగాసానాలు వేస్తే మానసిక ఒత్తిడి తొలగి ప్రశాంతం చేకూరుతుందన్నారు. శ్వాసను మనసుతో అనుసంధానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఇతర న్యాయమూర్తులు, న్యాయ శాఖ ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ మరో'సారీ'!

- 15 శాతం మంది రైతులకు మొండిచేయి

కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడి సాయం అందించే కార్యక్రమం మరింత ఆలస్యం కానుంది. ముందుగా ప్రకటించిన ప్రకారం మొదట ఈ నెల 12న.. ఆ తర్వాత 20 లేదా 21వ తేదీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లుగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ తేదీల్లో ఆ ఊసే లేకుండా పోయింది. పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన రోజునే అన్నదాత సుఖీభవ నిధులు కూడా విడుదల చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో 2,55,265, నంద్యాల జిల్లాలో 1,85,768 మంది రైతులకు అర్హత లభించింది. 2023–24 సంవత్సరంలో అప్పటి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా కింద లబ్ధిపొందిన రైతుల సంఖ్యతో పోలిస్తే 15 శాతం మంది రైతులకు అన్యాయం జరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కనీసం 25 సెంట్ల భూమి ఉన్నా పెట్టుబడి సాయం అందించింది. కూటమి ప్రభుత్వం 1.50 ఎకరాలకు పైబడి పట్టా భూములున్నా మొండి చేయి చూపింది. గత ప్రభుత్వం డి.పట్టాలు కలిగిన భూములకు, కౌలుదారులకు కూడా పథకాన్ని వర్తింప చేసింది. కూటమి ప్రభుత్వంలో డి.పట్టా భూములు, కౌలుదారుల ఊసే లేకపోవడం గమనార్హం.

ఎన్ని ఇబ్బందులెదురైనా ప్రజల తరఫున పోరాటం

సీఎం హోదాలో చంపేస్తాం, నరుకుతామంటున్నారు!

- మంత్రులు ఎమ్మెల్యేలు సంస్కార హీనంగా మాట్లాడుతుంటే కట్టడి చేయరేం
- రాష్ట్రంలో క్రిమినల్, డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయి
- కేసులతో ఇబ్బందులు పెడితే న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(టౌన్): కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రజలకు అండగా పోరాటం కొనసాగిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీమోహన్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు సంస్కారహీనంగా, పత్రికల్లో రాయలేని భాష వాడిన వీడియోలను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాదరణ కలిగిన మాజీ ముఖ్యమంత్రి జగన్ భద్రతపై అనుమానాలు ఉన్నాయని, వైసీపీ శ్రేణుల్లోను ఆందోళనలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదని, వెంటనే కేంద్ర బలగాలచే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రులు ఎమ్మెల్యేలు సంస్కార హీనంగా మాట్లాడుతుంటే ముఖ్యమంత్రి కనీసం కట్టడి కూడా చేయలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో క్రిమినల్, డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయన్నారు. 30 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం ఎగ్గొట్టారని, ఊర్లలో తిరిగితే తల్లుల చేతుల్లో ప్రజా ప్రతినిధులకు తన్నులు తప్పవన్నారు. తనపై విజిలెన్స్ కేసులు పెట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాల కుట్రలు చేస్తుందన్నారు. కేసులు పెట్టి వేదించాలని చూస్తే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, బీసీ సెల్ అధ్యక్షుడు రాఘవేంద్ర, విద్యార్థి విభాగం, యువజన విభాగం నాయకులు శివా రెడ్డి, కటికె గౌతమ్ పాల్గొన్నారు.

ఆదరణను ఓర్వలేకే ఆంక్షలు
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను ఓర్వలేకనే ఆయన కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం లేనిపోని ఆంక్షలు విధిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై అధికార పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. బెదిరించగలరేమో కానీ పోలింగ్ బూత్‌లో ఓట్లు వేయించలేరనే విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తించాలి. – కంగాటి శ్రీదేవి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే

క్లుప్తంగా

రక్తదానం చేసిన ఆర్డీఓ



రక్తదానం చేస్తున్న పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్

ఆదోని టౌన్: పత్తికొండ ఆర్డీఓ డాక్టర్ ఎస్.భరత్ నాయక్ శనివారం ఆదోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(ఏరియా ఆసుపత్రి)లో రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఇప్పటికే ఐదుసార్లు రక్తదానం చేశానన్నారు. రక్తం దానం చేయడం ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపడమే అన్నారు. బాధితుల కుటుంబాల్లో సంతోషాన్ని నింపినవారమవుతామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే రక్తదానం ప్రధాన లక్ష్యమన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ



ఆలూరు రూరల్: డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఒక లారీ ఆలూరులోని డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. లారీ కర్నూలు నుంచి బళ్లారి వైపునకు ఆలూరు మీదుగా వెళ్తోంది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం అర్ధరాత్రి సయమం కావడంతో ఆలూరులోని సహకారం సంఘం బ్యాంక్ సమీపంలో డివైడర్‌పైకి లారీ దూసుకెళ్లింది. ప్రమాదంలో లారీ కింది భాగమంతా ధ్వంసం కాగా.. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు.

నల్లమలలో ట్రాఫిక్ జాం



నల్లమలలో నిలిచి పోయిన ట్రాఫిక్

ఆత్మకూరురూరల్: నల్లమల ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆత్మకూరు – దోర్నాల ప్రధాన రహదారిలోని నంద్యాల – ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లో శనివారం భారీ వృక్షం నేల కూలడంతో రెండు గంటల సేపు ట్రాఫిక్ నిలిచి పోయింది. పెద్ద పెంట రాస్తా ఏటిపాయ గేటు వద్ద మధ్యాహ్నం 12 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనతో దాదాపు 2 గంటల వరకు అడవిలో ప్రయాణికులు అల్లాడి పోయారు. అటవీ శాఖకు చెందిన ప్రొటక్షన్ వాచర్లు అక్కడికి చేరుకుని చెట్టును తొలగించడంతో వాహనాల రాకపోకలు యథాతథంగా కొనసాగాయి.

జిల్లా ఔషధ నియంత్రణ అధికారి బాధ్యతల స్వీకరణ

గోస్పాడు: జిల్లా ఔషధ నియంత్రణ అధికారిగా హనుమన్న శనివారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన దాదా ఖలందర్ చిత్తూరు జిల్లా మదనపల్లెకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురంలో పని చేస్తున్న హనుమన్నను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విధుల్లో చేరారు. నంద్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలతో పాటు కర్నూలు అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. డోన్, డివిజన్‌కు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా కర్నూలు రూరల్ విభాగానికి జయరాంను నియమించారు.

వసతి మూత‘బడి’

- తలుపులు తెరుచుకోని బీసీ బాలుర వసతి గృహం
- ఇంటి బాట పట్టిన విద్యార్థులు





తలుపులు తెరుచుకోని బీసీ బాలుర వసతి గృహం, మూతపడిన గదులు

ఆలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. పేద విద్యార్థులకు వసతి గృహాలు కూడా అందుబాటులోకి రాని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12న పునఃప్రారంభం కాగా ఆలూరులోని సాంఘిక సంక్షేమ శాఖ బీసీ బాలురు వసతి గృహం ఇంత వరకు తెరుచుకోలేదు. విద్యార్థులు ఇక్కడ ఉండలేక ఇంటి బాట పట్టారు. సొంత భవనం లేకపోవడంతో ఆలూరు సమీపంలోని ఎల్లార్తి రోడ్డు వద్ద ప్రగతి జూనియర్ కళాశాల, పాఠశాల ఆవరణలోనే గత ఏడాది నుంచి సాంఘిక సంక్షేమ శాఖ బీసీ బాలురు వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ బాలుర వసతి గృహంలో 120 మంది, కళాశాల వసతి గృహంలో 110 మంది ఉంటున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హెచ్‌డబ్ల్యూఓ సంపత్‌కుమార్‌ను ఈనెల 10న కర్నూలుకు బదిలీ చేశారు. ఆదోని డివిజన్ ఏఎస్‌డబ్ల్యూఓగా విధులు నిర్వహిస్తున్న రాజా కుళ్లాయప్ప ఈనెల 1న పదవీ విరమణ పొందారు. ఆదోని, ఆలూరు సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహాలకు ఏఎస్‌డబ్ల్యూఓగా పత్తికొండలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఆలూరు బీసీ బాలుర వసతి సంక్షేమ కళాశాల వసతి గృహానికి అనిమిరెడ్డిని హెచ్‌డబ్ల్యూఓగా అధికారులు నియమించారు. అయితే ఆరోగ్య కారణాలతో ఆయన ఇప్పటి వరకు బాధ్యతలు స్వీకరించలేదు. వసతి గృహాల తలుపులకు మూతపడి ఆదివారం నాటికి 22 రోజులకు చేరుతుంది. వసతి గృహం తెరవకపోవడంతో విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఒక ఫైల్ కూడా పంపామని ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసులు తెలిపారు.

‘కూటమి’ నాయకుల ధ్వంస రచన

- ఆదోనిలో వైఎస్సార్‌సీపీ జెండా కట్ట ధ్వంసం
- త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



జెండా కట్ట ధ్వంసం చేసిన దృశ్యం

ఆదోని టౌన్: ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ‘కూటమి’ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ధ్వంస రచన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఆదోని పట్టణంలోని విజయనగర్ కాలనీలో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ జెండా కట్టను ధ్వంసం చేశారు. జెండా, జెండాకు సంబంధించిన పైపును విరగొట్టారు. శనివారం ఉదయం సమాచారం అందుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవ, పట్టణ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు అక్కడి వెళ్లి ధ్వంసమైన కట్టను పరిశీలించారు. అనంతరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుండాన్ని చూస్తూ సహించలేక ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారన్నారు. పార్టీ జెండాను ఇలా అవమానించడం తగదన్నారు. ఇలాంటి దుశ్చర్యలతో ఘర్షణలు, గొడవలు జరిగే ప్రమాదం ఉందన్నారు. దుండగులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణ సెక్రటరీ తాయన్న, ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు యేసేపు, కౌన్సిలర్ అశోక్, నాయకులు ప్రసాద్, బుడ్డేకల్ బాబు, కిషోర్, పట్టణ కార్యదర్శి బాబా, కౌన్సిలర్‌లు రఘునాథ్‌రెడ్డి, ఫయాజ్, అశోక్, నాయకులు దినేష్, ఉస్మాన్, చిన్నరామకృష్ణారెడ్డి, భీమ, వీరప్ప, నారాయణ, హరిశ్చంద్ర, కౌన్సిలర్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

అడుగు దూరంలో నీటి విడుదల

- పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను తాకిన కృష్ణాజలాలు



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను తగిలిన కృష్ణాజలాలు

జూపాడుబంగ్లా: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి వస్తున్న వరద ప్రవాహం కొనసాగుతుండటంతో నీటిమట్టం రోజుకు రోజుకు పెరిగి కృష్ణాజలాలు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను తగిలాయి. ప్రస్తుతం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 851.90 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం శ్రీశైలం డ్యాంలో 854 అడుగుల నీటి మట్టం చేరుకోగానే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేసుకోవచ్చు. గతేడాది జులై 27న పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లు ఎత్తి దిగువనున్న కాల్వలకు సాగు, తాగునీటిని విడుదల చేశారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలవల్ల శ్రీశైలం డ్యాంలోకి వరదనీరు వచ్చి చేరుతుండటంతో క్రమేణా డ్యాంలో నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో గతేడాది కంటే నెలరోజులు ముందుగానే పోతిరెడ్డిపాడు నుంచి దిగువకు నీటిని విడుదల చేసుకునే అవకాశాలున్నాయి.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు ...

- ఆటో బోల్తా పడి వృద్ధురాలి దుర్మరణం



ప్రమాదస్థలం వద్ద క్షతగాత్రులు



ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీదేవి

గోస్పాడు/మహానంది: ఎస్.నాగులవరం-పసురపాడు గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబం దైవదర్శనం నిమిత్తం రంగాపురం సమీపంలోని మద్దిలేటి స్వామి దర్శనానికి ఆటోలో వెళ్లారు. పూజలు నిర్వహించుకుని తిరిగి వస్తుండగా ఎస్.నాగులవరం సమీపంలో ఆటో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆవుల లక్ష్మీదేవి(65) అక్కడికక్కడే మృతి చెందింది. వెంకటేశ్వర్లు, మౌనిక, చిన్న సరవయ్య, లక్ష్మీపతి, ఆవుల నరసమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఆవుల నరసమ్మను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. మృతురాలు లక్ష్మీదేవి భర్త గత కొద్దినెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారని, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు బంధువులు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆత్మహత్యలే శరణ్యం

- సెల్‌టవర్ ఎక్కి పంచాయతీ కార్మికుల నిరసన



గూడూరులో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని నగర పంచాయతీ కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం గూడూరు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు అరవింద్, మధు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో పనిచేస్తూ తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. 15 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయడంతో పాటు నెలనెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 46రోజుల నుంచి విధులు బహిష్కరించి నిరవధిక దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిరసనలో కార్మికులు దూకేశ్వరరావు, షబ్బీర్, ఆంజనేయులు, బసవరాజు, జయన్న, అల్లిబాషా, ఖాజా, ప్రభాకర్, ఉసేన్, పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా ఫక్కీలో రూ.2 లక్షలు చోరీ

ఆదోని అర్బన్: సినిమా ఫక్కీలో రైతుకు సంబంధించిన రూ.2 లక్షల డబ్బును శనివారం చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు మండలం ఎ.గొనేహాల్ గ్రామానికి చెందిన రైతు రవికుమార్‌రెడ్డి ఆదోని పట్టణంలోని ఇండియన్ బ్యాంకుకు వచ్చాడు. తన వద్ద ఉన్న 5.42 గ్రాముల బంగారాన్ని తాకట్టు పెట్టి రెండున్నర లక్షలు రుణం తీసుకున్నారు. ఇందులో రెండు లక్షలు డ్రా చేసుకుని బయటకు వచ్చాడు. బైకు బ్యాగులో డబ్బు పెట్టాడు. తన బైకు అడ్డంగా ఉన్న బైకును పక్కకు తీస్తుండగా రూ.2 లక్షలు మాయమయ్యాయి. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీరాం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడున్న సీసీ కెమెరాలు తదితర విషయాలపై ఆరా తీశారు. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కన్నీటి కష్టాలు పట్టవా?

- ఎల్లెల్సీ నీటిలో నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన



ఎల్లెల్సీ కాలువలో నీటిలో అర్ధనగ్నంగా నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని, సమస్యలు పరిష్కరించాలని గత 46 రోజులుగా సమ్మె చేస్తున్నామని, అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని మున్సిపల్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికులు శనివారం తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) వరకు ర్యాలీగా వెళ్లారు. కాలువలో అర్ధనగ్నంగా నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ, రాజేంద్ర మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్.. కార్మికుల అకౌంట్‌లో జమ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల కోసం విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాణ్యం: పిన్నాపురం గ్రామ రస్తాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. శనివారం సాయంత్రం గొర్రెల కాపరులు గడ్డిలో నుంచి దుర్వాసన వస్తుండడంతో వెళ్లి చూడగా వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. మృతదేహంపై దుస్తులు లేకపోవడం, కాళ్లకు బెల్ట్ చెప్పులు ఉన్నట్లు గుర్తించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా వేరే ప్రాంతంలో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గురుకులాల్లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షలో అర్హత కలిగిన విద్యార్థులు (బాలికలు) ఈ నెల 22న దిన్నెదేవరపాడులోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆమె శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

- బాలురకు 23వ తేదిన చిన్నటేకూరులోని అంబేద్కర్ గురుకుల కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.
- జూనియర్ ఇంటర్ విద్యార్థులు ఫస్ట్ ఫేజ్‌లో ఇతర జిల్లాలకు ఎంపికైన బాలికలు, జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26న దిన్నెదేవరపాడు పాఠశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.
- 27వ తేదిన బాలురు చిన్నటేకూరులోని కళాశాలలో హాజరు కావాలన్నారు.
- అలాగే 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి అర్హత కలిగిన వారు ఈ నెల 23లోగా దరఖాస్తులను తమకు సమీపంలోని పాఠశాలల్లో అందించాలన్నారు. ఈ ప్రవేశాలకు 6, 7 తరగతులకు 25న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, 8, 9 తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.
- ఈ ప్రవేశ పరీక్షకు బాలికలు దిన్నెదేవరపాడు, బాలురు చిన్నటేకూరు గురుకుల విద్యా సంస్థల్లో హాజరు కావాలన్నారు.
- అర్హులైన విద్యార్థులందరికీ ఫోన్ కాల్ ద్వారా సమాచారాన్ని అందజేస్తామన్నారు.
- మరిన్ని వివరాలకు 08518–295601, 9010070219, 9014372809 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమాచారాన్ని పక్కాగా పంపండి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేది నాటికి పక్కాగా పంపించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి కోరారు. శనివారం సాయంత్రం ఆయన తన చాంబర్ నుంచి జిల్లా లోని ఎంపీడీఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లోని సచివాలయాలకు సంబంధించి ఏవైనా సాంకేతిక సమస్యలను, ఇతరత్రా వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

- బాధితుల్లో ఎంపీటీసీ సభ్యుడు



వైద్యం కోసం సి.బెళగల్ పీహెచ్‌సీకి వచ్చిన బాధితులు

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో పిచ్చికుక్క దాడి చేయడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. తొలుత గ్రామ శివారులోని ఇటుబట్టీలో పనిచేసే ప్రదీప్‌పై దాడి చేసి గాయపరచింది. అనంతరం గ్రామంలోకి ప్రవేశించి తహసీల్దార్ కార్యాలయం దగ్గరున్న సి.బెళగల్ ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్‌ను కరిచింది. వెలుగు కార్యాలయం బయట ఉన్న సీసీ శ్రీనివాసులుపై దాడిచేసి గాయపరచింది. పోలీస్ స్టేషన్‌లో వెళ్లి కొత్తకోట గ్రామానికి చెందిన మధు అనే యువకుడికి కరిచి గాయపరచింది. బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తిని కరవడంతో అతను గాయంతో అలాగే వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. బాధితులకు సి.బెళగల్ పీహెచ్‌సీలో డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యం అందించారు.

మెప్మా సీఆర్పీ రిమాండ్‌కు తరలింపు

బొమ్మలసత్రం: పొదుపు మహిళల రుణాలను కాజేసి మోసం చేసిన మెప్మా సీఆర్పీ షేక్ వహీదాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణంలోని ఫరూక్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ వహీదా మెప్మా సీఆర్పీగా పని చేస్తున్నారు. ఆమె పరిధిలోని 30 పొదుపు గ్రూపులు ఉన్నాయి. కాగా ఆయా పొదుపు గ్రూపులకు మంజూరు చేసిన రుణాలను సగం తీసుకుని మిగిలిన సగం మాత్రమే పొదుపు సభ్యులకు ఇవ్వడం.. అలాగే వారు చెల్లించిన రుణ కంతులను బ్యాంకులో జమ చేయకుండా కాజేశారు. అయితే తీసుకున్న రుణాలు చెల్లించలేదని బ్యాంకు అధికారులు పొదుపు మహిళలకు నోటీసులు పంపడంతో సీఆర్పీ వహీదా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. మోసపోయామని గ్రహించిన పొదుపు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఆర్పీ వహీదాపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఆమెను రిమాండ్‌కు తరలించామన్నారు.